క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



వీరయ్యను పరామర్శిస్తున్న కళావతి

వీరఘట్టం: మండలంలోని వండవ గ్రామానికి చెందిన వీఆర్ఏ వీరయ్యను మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మంగళవారం పరామర్శించారు. వీరయ్య తల్లి అప్పలనరసమ్మ మంగళవారం అనారోగ్యంతో మరణించింది. ఈ మేరకు కళావతి వీరయ్యను పరామర్శించారు. అండగా ఉంటామని, ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు.

మెరుగైన విద్యనందించాలి

గరుగుబిల్లి: విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఎంఈవో ఎన్.నాగభూషణరావు సూచించారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ఆయన.. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యాబోధన చేయాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాల బోధన ఉండాలని తెలిపారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందేలా పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ ఎస్.ఎల్.ఎన్. పాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

వీడీవీకే యూనిట్ల పరిశీలన

సీతంపేట: మండలంలోని వన్‌ధన్ వికాస్ కేంద్ర యూనిట్లను ఒడిశాకు చెందిన ట్రైబల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు దెబతోస్ మెహతో మంగళవారం పరిశీలించారు. స్థానిక కొండచీపర్లు, జీడి యూనిట్‌లను సందర్శించారు. అక్కడ అమలు చేస్తున్న విధానాలను ఒడిశాలో కూడా అమలు చేసేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. వెలుగు అధికారులు పాల్గొన్నారు.

నేత్ర శస్త్రచికిత్సకు పయనం

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం నుంచి విజయనగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి పలువురు రోగులు పయనమయ్యారు. కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల పరిధిలోని గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన వైద్య శిబిరంలో నేత్ర శస్త్రచికిత్సకు ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా కంటి వెలుగు సెల్ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. రోగుల్లో కెటరాక్ట్(అంతర కుసుమం), టెరీజియం(కొయ్యకండ) వంటి కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఎక్కువగా ఉన్నారని, వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయడంతో పాటు ఉచిత రవాణా, భోజనం, వసతి సదుపాయాలు కల్పించి, మందులు, కళ్లద్దాలు అందజేయడం జరుగుతుందన్నారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాల పరిశీలన

భామిని: మండలంలోని బురుజోల మెట్ట వద్ద అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న స్థలాన్ని పాలకొండ సబ్‌కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి మైనింగ్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించాడు. సాక్షిలో ప్రచురితమైన 'యథేచ్ఛగా గ్రావెల్ తరలింపు' కథనంపై అధికారులు స్పందించారు. అనుమతులు లేకుండా గ్రావెల్‌ను తరలిస్తున్న వాహనాలను పట్టుకుని సీజ్ చేయాలని, తవ్వకాలు జరుపుతున్న ప్రదేశంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అనంతరం వంశధార నదీ తీరంలో ఒడిశా అనుమతులతో నడుస్తున్న ఇసుక ర్యాంపులను పరిశీలించారు. రోడ్డుపై ఇసుక లోడుతో వెళ్తున్న లారీని ఆపి అనుమతి పత్రాలు పరిశీలించారు. ఎటువంటి అనుమతులు లేని ఇసుక లారీకి రూ.50 వేలు జరిమానా వేసి మైనింగ్ శాఖకు అప్పగించారు. వారి వెంట ఆర్ఐ ఎస్.రాంబాబు, సర్వేయర్ రాజేశ్వరరావు, వీఆర్‌ఓలు వెంకటరమణ, ఎర్నాకులం ఉన్నారు.

విగ్రహాల ఆవిష్కరణ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): కురుపాం మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీ ఎదుట ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎన్టీఆర్ విగ్రహాలను మంగళవారం ఆవిష్కరించారు. కురుపాం, బొబ్బిలి, పార్వతీపురం ఎమ్మెల్యేలు తోయక జగదీశ్వరి, బేబీనాయన, బోనెల విజయచంద్రలు ఈ కార్యక్రమంలో పాల్గొని, ఆయా నేతలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ దేవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్‌చంద్రదేవ్ పాల్గొన్నారు.

అతి అనర్థమే..



- అధికంగా ఎరువులు వాడితే పంటకు నష్టం
- పంట దిగుబడి, పర్యావరణం, ఆరోగ్యంపై ప్రభావం
- మెళకువలు పాటిస్తే రైతులకు లాభం

పాలకొండ రూరల్: అధిక వర్షాలతో పంటలకు పుష్కలమైన సాగునీరు అందింది. ఈక్రమంలో వివిధ రకాల క్రిములు, పురుగులు పంటలకు ఆశిస్తాయి. సాగులో అధిక దిగుబడులను రాబెట్టేందుకు, కీటకాలను నాశం చేసేందుకు రైతులు మోతాదు మించి ఎరువులు, పురుగు మందులను వినియోగిస్తున్నారు. దీంతో భూ సారం దెబ్బతిని పంటల దిగుబడి కూడా తగ్గుతుంది. ముఖ్యంగా పర్యావరణానికి, ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని సంబంధిత శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. నియోజకవర్గంలో ఇటీవల కురిసిన వర్షాలకు లోతట్టు భూముల్లో నీరు నిలిచిపోయింది. ఈ క్రమంలో పంటలను దక్కించుకునేందుకు రైతులు ఎరువులపై ఆధారపడటం సర్వసాధారణమైయ్యింది. అవసరమగు ఎరువులను తగిన మోతాదులో వినియోగించాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

పరిమితికి మించితే ప్రమాదం..

పంటకు యూరియా అవసరమైన దాని కంటే ఎక్కువ వినియోగించడం వలన మొక్క మెత్తబడి చీడపురుగులు ఆశిస్తాయి. దీనివల పంట ఏపుగా పెరుగుతుందే తప్పా దిగుబడి కనిపించదు. అలాగే సుడిదోమ ఆశించే ప్రమాదం ఉంది. భూమిలో డీపీపీ(భాస్వరం) తగిన మోతాదులో వినియోగించడం వలన మొక్క వేళ్ల బలంగా తయారవుతాయి. అధికంగా వాడటం వలన ఆర్థిక భారం తప్ప ప్రయోజనం కనిపించదు. పురుగు మందులు అధికంగా వాడటం వలన పంట ఎర్రబడుతుంది. ఎరువులు, పురుగు మందులు అధికంగా వాడటం వలన ప్రధానంగా రైతుకు ఆర్థిక భారం అవుతుంది. ఆ పంట ఆరగించటం వలన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి.

నియోజకవర్గంలో సాగుభూమి	
మండలం	హెక్టార్లు
పాలకొండ	7,250
వీరఘట్టం	8,997
సీతంపేట	7,702
భామిని	6,432

ఇలా చేస్తే మేలు..

- పంటకు ఆశించిన చీడపీడలను ముందుగా గుర్తించిన రైతులు వ్యవసాయాధికారులు సంప్రదించి వారి సలహాలు, సూచలను మేరకు క్రిమిసంహారక మందులు వినియోగించాలి.
- క్రిమి సంహారక మందులు, ఎరువులు కొనుగోలు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పరిశీలించాలి.
- పురుగు మందుల తయారీ, గడువు తేదీలను, ఎంఆర్‌పీ ధరలను సరిచూసుకోవాలి. ప్రభుత్వ అనుమతి పొందిన దుకాణాల్లో ఎరువులను, పురుగు మందులను కొనుగోలు చేయాలి.
- కొనుగోలు చేసిన వాటికి రసీదు (బిల్లు) తీసుకోవాలి. పురుగు మందుల సీసాలు సీల్‌ను, ఎరువుల బస్తాల సీల్‌ను సరిచూసుకోవాలి.
- పంటలపై పురుగు మందులను పిచికారి చేసే సమయంలో రైతులు తమ చేతులకు గ్లోవ్స్, మొఖానికి మాస్క్ ధరించాలి. క్రిమిసంహారక మందులను కలిపేటప్పుటు వాటి గాఢతను తట్టుకోనే విధంగా జాగ్రత్తలు పాటించాలి.
- పిచికారి చేసేటప్పుడు చేతులను నోటిలో పెట్టరాదు, ఆహార పదార్థాలు తీసుకోరాదు. మద్యం సేవించి ఎరువులను, పురుగు మందులను పిచికారీ చేయరాదు.
- ఎండ తీవ్రత, బలమైన గాలులు వీస్తున్నప్పుడు పురుగు మందులను స్ప్రే చేయరాదు. గాలి వీచే దిశకు పిచికారీ చేయటం శ్రేయష్కరం.
- వర్షం కురిసిన వెంటనే పురుగు మందులు పిచికారీ చేయటం వలన ప్రయోజనం ఉండదని రైతులు గుర్తించాలి.

సూచనలు పాటించాలి



మార్కెట్‌లో కొనుగోలు చేసే క్రిమిసంహారక మందులు, ఎరువుల విషయంలో అవగాహన పెంచుకోవాలి. అధికారులు సూచనలు పాటించటం వలన ప్రయోజనం ఉంటుంది. గ్రామస్థాయిలో మా సిబ్బంది రైతులకు అవసరమగు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో అన్నదాతలకు అవగాహన సదస్సులు చేపడుతున్నాం.

– ఎన్ని వాహిని, వ్యవసాయశాఖ అధికారి, పాలకొండ

పీఎంఏవై ఇళ్లల్లో గృహప్రవేశాలు

జియ్యమ్మవలస: మండలంలోని గెడ్డతిరువాడ గ్రామంలో పీఎంఏవై పథకం కింద నిర్మించిన ఇళ్లల్లో మంగళవారం గృహప్రవేశాలు చేశారు. హౌసింగ్ పీడీ కేశవనాయుడు చేతులమీదుగా ఇళ్ల ప్రారంభం అనంతరం లబ్ధిదారులు తమ ఇళ్లల్లోకి అడుగుపెట్టారు. మండలానికి 40 పీఎంఏవై ఇళ్లు మంజూరు కాగా, ప్రస్తుతం 15 ఇళ్లు పూర్తయి గృహప్రవేశాలు కూడా జరిగాయని పీడీ తెలిపారు. మిగిలిన వారు కూడా నిర్మాణాలను వేగవంతం చేసి, పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఈ ఉమామహేష్, హౌసింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గెడ్డతిరువాడలో పీఎంఏవై ఇంటిని ప్రారంభిస్తున్న హౌసింగ్ పీడీ కేశవనాయుడు

కాంప్లెక్స్ సమావేశాల్లో గ్రూపు చర్చలు జరగాలి

వీరఘట్టం: కాంప్లెక్స్ సమావేశాల్లో గ్రూపు చర్చలు జరగాలని ఎంఈవో-2 డి.గౌరునాయుడు, ఆర్.ఆనందరావు సూచించారు. బిటివాడ, వీరఘట్టం గర్ల్స్ హైస్కూల్స్‌లో జరిగిన కాంప్లెక్స్ సమావేశాల్లో మంగళవారం వారు పాల్గొని ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించాలని, వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని సూచించారు. అనంతరం వీరఘట్టం బాలుర ఉన్నత పాఠశాల, కత్తుల కవిటి పాఠశాలల్లో జరిగిన ఎస్‌జీటీ ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ

సీపీఐ(ఎంఎల్) ఆందోళన

గుమ్మలక్ష్మీపురం: నిత్యవసర సరుకులు(నిత్యావసరాలు) ధరలు తగ్గించాలని సీపీఐ(ఎంఎల్) పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శి పెడారపు భాస్కరరావు, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పాలక సహదేవుడు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి డి.సూర్యకళ డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ కొత్తగా వివాహమైన గ్రామీణ కార్మికులకు ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులు ఇవ్వాలని, వందరోజుల లేబర్ బడ్జెట్ పూర్తయ్యే వరకు పనులు ఇవ్వాలని, ఉపాధి హామీ పథకంలో కేంద్రం తెచ్చిన మార్పులను రద్దు చేయాలని, వ్యవసాయ రుణాలు, పెట్టుబడి రుణాలు అందజేయాలని, మహిళా రక్షణ కోసం కఠిన చట్టాలు అమలు చేయాలని కోరారు. అలాగే వీరఘట్టం, కురుపాం నియోజకవర్గంలో ఉన్న గిరిజన ఆదివాసీలను ఐదో షెడ్యూల్‌లో చేర్చాలని, గిరిజన ప్రాంతంలో మైనింగ్ మాఫియాను అరికట్టాలని, ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని, భూమి లేని రైతులకు రెండున్నర హెక్టార్ల భూమి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం తహసీల్దారు అప్పారావుకు వినతిపత్రం అందజేశారు.



తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు, కార్యకర్తలు

జాబ్‌మేళాలో 274 మంది ఎంపిక

పాలకొండ: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం సత్యసాయి విద్యాసంస్థల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ మేళాకు 17 కంపెనీల నుంచి ప్రతినిధులు హాజరై అభ్యర్థులకు ఇంటర్వ్యూలు చేశారు. మొత్తం 695 మంది నిరుద్యోగులు హాజరు కాగా వారిలో 274 మంది పలు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ మేనేజర్ యు.సాయికుమార్, సత్యసాయి విద్యాసంస్థల ప్రతినిధులు బి.లక్ష్మీనారాయణ, ఎ.శ్రీనివాస్, టీడీపీ నాయకులు కర్నేన అప్పలనాయుడు, గంటా సంతోష్, గండి రామినాయుడు, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన యువతతో ఎమ్మెల్యే తదితరులు

వైద్య, రక్తదాన శిబిరాలు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ పుట్టినరోజు సందర్భంగా కురుపాం కోటలో ఉచిత వైద్య శిబిరంతో పాటు రక్తదాన శిబిరం మంగళవారం నిర్వహించారు. కొంతమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు రక్తదాన శిబిరానికి వెళ్లి, రక్తం దానం చేశారు. వైద్య శిబిరానికి హాజరైన రోగులకు వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కోలా రంజిత్‌కుమార్, డొంకాడ రామకృష్ణ, పువ్వల లావణ్య, వెంపటాపు భారతి, జియ్యమ్మవలస ఎంపీపీ బొంగు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం రద్దు

సీతంపేట: స్థానిక వైటీసీలో బుధవారం జరగాల్సిన రక్తదాన శిబిరం రద్దయినట్లు ఎంపీడీఓ కె.గీతాంజలి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైద్యుల సమ్మె కారణంగా శిబిరాన్ని రద్దు చేసినట్లు పేర్కొన్నారు. మళ్లీ ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే ప్రకటించనున్నట్లు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష వితరణ



విరాళం అందిస్తున్న వెంకటరమణ

పాలకొండ: స్థానిక సత్యసాయి మందిరం ఆధ్వర్యంలో నిర్వహించే నిత్యాన్నదాన కార్యక్రమానికి పట్టణానికి చెందిన పొట్నూరు వెంకటరమణ లక్ష రూపాయలు వితరణ చేశారు. వెంకటరమణ పుట్టినరోజు సందర్భంగా తన తల్లిదండ్రులు సూరపునాయుడు, అన్నపూర్ణమ్మ జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని మందిరం ప్రతినిధులు ఆర్.కిశోర్, కర్రా సుధాకర్, ఎన్వీ రమణలకు మంగళవారం అందించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి రోజు 150 మందికి అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా పీఎం పుట్టినరోజు

భామిని: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజు వేడుకలను బీజేపీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. భామిని, బాలేరు పీహెచ్‌సీల్లో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి కె.తిరుపతిరావు, మండల నాయకులు ఎం.రాంబాబు, టి.వాసు, అనీల్ కాంత్రో, కె.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

భామిని: గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా ఉండేందుకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.ఎన్.రాణి అన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సంపూర్ణ పోషణ అభియాన్ సమావేశంలో ఆమె పాల్గొని సిబ్బందికి పలు సూచనలు చేశారు. గర్భిణులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలని, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. బాలేరు, భామిని పీహెచ్‌సీ వైద్యాధికారులు దీపికా రాణి, పసుపులేటి సోయల్ గర్భిణులు తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాలు వివరించారు. అనంతరం ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిభవానీ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతం, పౌష్టికాహార ప్రదర్శన చేపట్టారు. బీసీఓ వరలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీ ఎం.ఎన్.రాణి

అప్రెంటీస్ కోసం వినతి

సీతంపేట: తామంతా స్థానిక కేజీబీవీలో ఎంపీహెచ్ డబ్ల్యూ కోర్సు పూర్తి చేశామని, అప్రెంటీస్ శిక్షణ ఇప్పించాలని కోరుతూ పలువురు విద్యార్థినులు మంగళవారం ఐటీడీఏను ఆశ్రయించారు. సుమారు 25 మంది విద్యార్థులు ఈ సంవత్సరం ఎంపీహెచ్ డబ్ల్యూ కోర్సు పూర్తి చేశామన్నారు. తమకు సీతంపేట ఏరియా ఆస్పత్రిలో శిక్షణ ఇవ్వాలని విద్యార్థినులు సుజాత, సునీత, భారతి, మల్లిక, శాంతి తదితరులు అధికారులను కోరారు.



ఐటీడీఏను ఆశ్రయించిన విద్యార్థినులు

మండల స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

సీతంపేట: ఎస్‌జీఎఫ్ క్రీడలకు మండల స్థాయి ఎంపికలు మంగళవారం జరిగాయి. వివిధ పాఠశాలల నుంచి 500 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉపవిద్యాశాఖాధికారి పి.నారాయుడు మాట్లాడుతూ చదువులతో పాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి క్రీడల్లో తలపడి ఐటీడీఏకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రరావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఖోఖోలో తలపడుతున్న విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో విశ్వకర్మ పూజలు



గరుగుబిల్లి: గొట్టివలసలో విశ్వకర్మ పూజలు చేస్తున్న చేస్తున్న భక్తులు



భామిని: విశ్వకర్మ విగ్రహాన్ని ఊరేగిస్తున్న విశ్వబ్రాహ్మణులు

భామిని: మండలంలోని బత్తిలిలో విశ్వకర్మ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ విగ్రహాన్ని మేళతాళాలతో ఊరేగించారు. మందిరంలో ప్రతిష్టించి ప్రత్యేక పూజలు చేశారు. పంచకుల వృత్తులకు చెందిన పలువురు భక్తులు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రధాన మార్కెట్ సమీపంలో విశ్వకర్మ విగ్రహాన్ని ప్రతిష్టించి పూజలు చేపట్టారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను సనారీ విశ్వేశ్వర విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంక్షేమ సంఘం, సనారి మఠం అభివృద్ధి కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

గరుగుబిల్లి: మండలంలోని గొట్టివలస గ్రామంలో ఉన్న శ్రీగోవిందమాంబ సమేత శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, దీపారాధన, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. అర్చకులు అజ్జరాపు గణపతి ఆచారి నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ నాయుకులు అజ్జరాపు కాశీవిశ్వేరరావు, తిరుపతిరావు, తదిటాచారి, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: విశ్వకర్మ జయంతి పురస్కరించుకుని, స్థానిక ప్రధాన రహదారి జంక్షన్‌లో విశ్వకర్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, పూజలు నిర్వహించారు. శ్రీగాయత్రి విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మండవవాహన, పూర్ణాహుతి పూజలు చేపట్టారు. మూడు రోజుల పాటు జరిగే విశ్వకర్మ పూజల్లో పాల్గొని, బ్రహ్మ ఆశీస్సులు పొందాలని సంఘ సభ్యులు కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు కె.గౌరీశ్వరరావు, సభ్యులు సత్యం, శ్రీనివాసరావు, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గుమ్మలక్ష్మీపురం: విశ్వకర్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, పూజలు చేస్తున్న భక్తులు

వీరఘట్టం: స్థానిక విశ్వబ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విశ్వకర్మ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మాజీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ బూరాడ లక్ష్మీకాంతం, సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు బూరాడ లక్ష్మీనారాయణ ఆచారి తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

● 'నులి'మేద్దాం!



గరుగుబిల్లిలో చిన్నారులతో నులిపురుగు నివారణ మాత్రలు మింగిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది



కొమరాడ: విక్రంపురం పాఠశాలలో విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో జగన్మోహనరావు

జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ మంగళవారం చేపట్టారు. అధికారులు, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థులతో మాత్రలు మింగించారు. అపరిశుభ్రత, కలుషిత ఆహారం ద్వారా మానవ శరీరంలోని పేగులోకి చేరి, మకాం వేసే నులిపురుగులు రక్తం పీల్చి, రక్తహీనత బారినపడేలా చేస్తుందని వైద్య సిబ్బంది తెలిపారు. 19 ఏళ్లలోపు వారంతా తప్పనిసరిగా నులిపురుగు నివారణ మాత్రలు వేసుకోవాలని సూచించారు. ప్రతి ఆరు నెలలకోసారి మాత్రలు అందివ్వడం జరుగుతుందని, ఆరోగ్యవంతమైన పిల్లల కోసం తప్పనిసరిగా మాత్రలు వేయించాలన్నారు. మాత్రలు మింగిద్దాం.. నులిపురుగులు నులిమేద్దాం, ఒక్క మాత్రతో నులిపురుగులు తరిమేసి, ఆరోగ్యంగా తయారవుదాం.. అని నినాదాలు చేశారు.

–గరుగుబిల్లి, కొమరాడ

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యం

స్వచ్ఛ గ్రామాలే లక్ష్యంగా స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొని, గ్రామాల పరిశుభ్రతకు ప్రతిఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలని, వాటిని పరిశుభ్రంగా ఉంచితేనే ఆరోగ్యవంతమైన సమాజం రూపొందుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉండేలా చూసుకోవాలని, మొక్కలు నాటాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అవగాహన ర్యాలీలు, మానవహారాలు చేపట్టి, గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుతామని ప్రతిజ్ఞ చేశారు.

–పాలకొండ, కురుపాం



గుమ్మలక్ష్మీపురం: తాడికొండలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమ ర్యాలీ



గరుగుబిల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో పైడితల్లి, తదితరులు



కొమరాడ: గ్రామాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో మల్లికార్జునరావు, తదితరులు



పాలకొండ రూరల్: తంపటాపల్లిలో చీపుర్లతో వీధులు శుభ్రం చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



పాలకొండ రూరల్: ఆర్టీసీ డిపోలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది



సీతంపేట: బస్టాండ్ కూడలి వద్ద మానవహారంగా ఏర్పడిన అధికారులు, విద్యార్థులు